క్లుప్తంగా

నూకాలమ్మ రజత వస్త్రానికి వెండి సమర్పణ



నూకాలమ్మవారి రజత వస్త్రానికి వెండి సమర్పిస్తున్న భక్తులు

జంగారెడ్డిగూడెం: స్థానిక నూకాలమ్మవారికి రజత వస్త్రానికి భక్తులు వెండిని సమర్పించుకున్నారు. శుక్రవారం కావడంతో తొలుత అమ్మవారికి నిత్య కైంకర్యాలతో పాటు విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి రజత వస్త్రానికి పలువురు భక్తులు సుమారు 20 తులాల వెండిని అందజేశారని ఆలయ చైర్మన్ రాజాన సత్యనారాయణ తెలిపారు. ఈ నెల 28న ఆలయ యాగశాల వద్ద లోకకల్యాణార్థం 56వ చండీహోమం నిర్వహించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ చిటికెన రాంబాబు, కమిటీ సభ్యులు, నూకాంబిక సేవా బృందం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా చండీహోమం



గంగానమ్మ ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న చండీహోమం

జంగారెడ్డిగూడెం: స్థానిక గంగానమ్మవారి ఆలయ ప్రాంగణంలో చండీహోమం ఘనంగా నిర్వహించారు. దసరా నవరాత్రి మహోత్సవాలు ముగిసిన సందర్భంగా ఏటా నిర్వహించే విధంగా శుక్రవారం ఆలయ ప్రాంగణంలో చండీహోమం నిర్వహించినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. పూజల్లో కౌన్సిలర్ అయినాల వెంకట రమణ మూర్తి దంపతులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. దసరా శరన్నవ రాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా శనివారం భారీ అన్నసమారాధన నిర్వహించనున్నట్టు తెలిపారు. అమ్మవారికి నివేదించిన లడ్డూ వేలం నిర్వహిస్తామన్నారు. ప్రజలు, గంగానమ్మ గుడి సెంటర్ వ్యాపారులు సహాయ సహకారాలు అందించాలని కోరారు.

1 నుంచి వర్ధంతి సభలు

బుట్టాయగూడెం: నవంబర్ 1 నుంచి 9వ తేదీ వరకు జిల్లాలోని ప్రతి మండలంలో అమరవీరుల వర్ధంతి సభలు నిర్వహించనున్నట్టు అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కలింపూడి సుందరరావు తెలిపారు. బుట్టాయగూడెం మండలం రేగుల కుంటలో సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ కార్యాలయం వద్ద వర్ధతి సభ నిర్వహించాలని కోరుతూ శుక్రవారం కరపత్రం విడుదల చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి సముద్రాల బాలసుందరం, నాయకులు తెల్లం కృష్ణ, పీఓడబ్ల్యూ నాయకురాలు పూనెం పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

ఎండిన వరి చేల పరిశీలన



ప్రగడవరంలో ఎండిన వరిని పరిశీలిస్తున్న నాయకులు

చింతలపూడి: మెట్ట ప్రాంతంలో వర్షాభావ పరిస్థితులతో ఎండిపోయిన వరి రైతులను ఆదుకోవాలని సీపీఎం నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సీపీఎం జిల్లా కమిటీ పిలుపు మేరకు శుక్రవారం ప్రగడవరం పంచాయతీలో ఎండిపోయిన వరి పొలాలను నాయకులు పరిశీలించారు. రెండు నెలలుగా వర్షాలు కురవకపోవడంతో వరిపొలాలు ఎండిపోయే దశకు చేరాయని, చింతలపూడి ప్రాంతాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని సీపీఎం మండల కన్వీనర్ రామిశెట్టి సత్యనారాయణ కోరారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల కార్యదర్శి కనమతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు ఎస్ సూర్య కుమార్, డి.సత్యనారాయణ పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమ ఈఈగా కుమార్

బుట్టాయగూడెం: కేఆర్‌పురం ఐటీడీఏ ఇంజినీరింగ్ ఈఈగా కేవీఎస్ఎన్ కుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. శ్రీశైలం డీఈగా పనిచేస్తున్న కుమార్‌ను ఇన్‌చార్జి ఈఈగా నియమిస్తూ ఇంజినీరింగ్ చీఫ్ విజయ ఉత్తర్వులు ఇచ్చారు. దీంతో ఆయన ఇక్కడ బాధ్యతలు చేపట్టారు. కుమార్‌ను డీఈలు శీలం జోనాథన్, ఎం.శ్రీనివాస్, ఏఈలు రహీమ్, లక్ష్మణరావు, సత్యనారాయణ, సీనియర్ అసిస్టెంట్ ఈఎన్ శ్రీనివాస్, సిబ్బంది దెయ్యాల ఆంజనేయులు తదితరులు అభినందించారు.

31న ఏఐటీయూసీ వ్యవస్థాపక దినోత్సవం

ఏలూరు (టూటౌన్): ఈనెల 31న ఏఐటీయూసీ 104వ వ్యవస్థాపక దినోత్సవాన్ని అన్ని ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించాలని యూనియన్ ఏలూరు జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు పిలుపు నిచ్చారు. స్థానిక కోటదిబ్బ ఎస్ఆర్ వన్ వద్ద ది.జోనల్ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం ప్రచార కార్యక్రమం చేపట్టారు.

మార్మోగిన గోవింద నామస్మరణ

శ్రీవారి తిరుకల్యాణ మహోత్సవం మరుసటి రోజు శుక్రవారం రథోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో డప్పు వాయిద్యాలు, కోలాట భజనలు, కోబ్రాడ్యాన్స్, శక్తి వేషధారణలు ఆకట్టుకున్నాయి. ఆ ప్రాంతమంతా భక్తుల గోవింద నామస్మరణతో మార్మోగింది.
– ద్వారకాతిరుమల



స్వామి, అమ్మవార్లను రథం వద్దకు తీసుకొస్తున్న అర్చకులు, భక్తులు



వేంకటేశ్వర స్వామి, అమ్మవార్ల వేషధారణ



శక్తి వేషధారణలు



రథం వద్ద బలిహరణను సమర్పిస్తున్న ఆలయ ఈఓ త్రినాథరావు కుటుంబీకులు



కోబ్రాడాన్స్

నవరత్న పథకాలే ఎన్నికల అజెండా

ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

కొయ్యలగూడెం: త్వరలో నిర్వహించే ఐదు రాష్ట్రాల ఎన్నికల బరిలో ఉన్న ప్రధాన పార్టీలు వైఎస్సార్ సీపీ ప్రభుత్వ నవరత్న పథకాలనే మేనిఫెస్టోగా పెట్టుకుని ఓటర్ల వద్దకు వెళుతున్నారని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పేర్కొన్నారు. కన్నాపురం గ్రామంలో శుక్రవారం తహసీల్దార్ పాశం నాగమణి ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆరోగ్య శిబిరంలో గుర్తించిన రోగులకు మందులు పంపిణీ చేశారు. ఐసీడీఎస్ శాఖ ఏర్పాటు చేసిన వైఎస్సార్ పోషకాహార స్టాల్‌ని ప్రారంభించి బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం అందజేశారు. అనంతరం కంటి సంబంధిత లోపాలతో ఉన్న విద్యార్థులకు కళ్లజోళ్లు పంపిణీ చేశారు. సర్పంచ్ ఉప్పల పద్మావతి, ఎంపీటీసీ ఎస్‌కే బాజీ, ఉప సర్పంచ్ ఎండీ ముంతాజ్ బేగం, కాటుబోయిన సురేష్, యడ్లపల్లి సురేష్, సొంగ రాకేష్, ఎండీ చిన్న హాజీ, డాక్టర్ శ్రీను, విల్లూరి మాధవరావు, ఉప్పల కృష్ణ, ఎండీ షాబాజ్ తదితరులు పాల్గొన్నారు.



కొయ్యలగూడెం : కన్నాపురంలో పోషకార స్టాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే



లింగపాలెం : వేములపల్లిలో వైద్య పరీక్షల రిపోర్టు అందిస్తున్న దృశ్యం

పరీక్షలతోనే సంపూర్ణ ఆరోగ్యం

లింగపాలెం : జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు ప్రజలకు వరమని వైస్ ఎంపీపీ-2 కర్లపూడి జాన్సి అన్నారు. లింగపాలెం మండలం వేములపల్లి గ్రామంలో శుక్రవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ-1 మట్టా సురేష్ మాట్లాడుతూ ప్రజా ఆరోగ్యానికి సీఎం జగన్‌మోహనరెడ్డి ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. వైద్యులు ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకుల చేతుల మీదగా మందులు, కిట్లు పంపిణీ చేశారు. లింగపాలెం మండలంలో నేటితో జగనన్న సురక్ష వైద్య శిబిరాలు ముగిశాయి. కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ ముఖ్యనేత మునునూరి వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ ఎస్ ఆశీర్వాదం, పార్టీ నాయకులు కర్లపూడి ఆనంద్, వెద్య, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు రైతుల ర్యాలీ

కొయ్యలగూడెం: జాతీయ టొబాకో దినోత్సవ కార్యక్రమం శనివారం నిర్వహిస్తున్నట్లు కొయ్యలగూడెం వర్జీనియా పొగాకు వేలం కేంద్రం నిర్వహణ అధికారి గ్రేసీ మార్గరెట్ పేర్కొన్నారు. ఎన్ఎల్ఎస్ పరిధిలోని వేలం కేంద్రాలలో రొటేషన్ పద్ధతిన నిర్వహిస్తున్న జాతీయ టొబాకోదినోత్సవం ఈదఫా కొయ్యలగూడెంలో నిర్వహిస్తున్నామన్నారు. ఈసందర్భంగా పొగాకు వేలం కేంద్రం భవనం నుండి ఉదయం 10 గంటలకు రైతులతోకలిసి ర్యాలీ నిర్వహిస్తున్నామని కొయ్యలగూడెం గణేష్ సెంటర్ వరకు కిలోమీటర్ మేర నిర్వహించే ర్యాలీలో బోర్డు అధికారులు కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని వర్జీనియా పొగాకు రైతు సంఘం అధ్యక్షుడు కాకర్ల నంది తెలిపారు.

వ్యక్తి అరెస్ట్

పోలవరం రూరల్: పోలవరం మండలం పైడిపాక గ్రామంలో 10 లీటర్ల సారాతో ఉన్న జె.జయరాజు అనే వ్యక్తిని శుక్రవారం అరెస్టు చేసినట్టు ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ తెలిపారు. సారాను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు.

పోలవరం నియోజకవర్గంలో పెరిగిన ఓటర్లు

బుట్టాయగూడెం: ఎస్ఎస్ఆర్-2024 డ్రాఫ్ట్ పబ్లికేషన్ జిల్లా కలెక్టర్ వై.ప్రసన్న వెంకటేష్ శుక్రవారం విడుదల చేశారు. ఈ డ్రాఫ్ట్‌లో పోలవరం నియోజకవర్గంలో ఓటర్ల సంఖ్య పెరిగింది, 2019 ఎన్నికల సమయంలో నియోజకవర్గంలో ఓటర్లు 2,38,820 ఉండగా వీరిలో పురుషులు 1,16743 మంది, స్త్రీలు 1,22,059 మంది, ఇతరులు18 మంది ఉన్నారు. ఎస్ఎస్ఆర్ 2024 డ్రాఫ్ట్ పబ్లికేషన్‌లో పోలవరం నియోజకవర్గంలో సుమారు 5493 మంది పెరిగారు. నియోజకవర్గంలోని మొత్తం ఓటర్లు 2,44,313 మంది ఉండగా వీరిలో పురుషులు 1,18,488 మంది, స్త్రీలు 1,25,815 మంది, ఇతరులు 10 మంది ఉన్నారు. పురుషులు 1745 మంది, స్త్రీలు 3576 మంది పెరిగారు. డిసెంబర్ 9వ తేదీ నాటికి క్లెయిమ్స్, అభ్యంతరాలు స్వీకరిస్తారు. అనంతరం ఓటర్ల సంఖ్య పెరుగుతుందో లేక తగ్గుతుందో తెలుస్తుంది. తుది జాబితా 2024 జనవరి 5న విడుదలయ్యే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

ఓటర్ల జాబితా డ్రాఫ్ట్ పబ్లికేషన్

పోలవరం రూరల్: పోలవరం మండలంలో ఓటర్ల జాబితా డ్రాఫ్ట్ పబ్లికేషన్ చేశామని తహసీల్దార్ బి.సుమతి తెలిపారు. ఈ మేరకు బీఎల్ఓలతో స్థానిక రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులందరినీ ఓటర్లుగా నమోదు చేయాలని పేర్కొన్నారు. మృతిచెందిన వారిని ఓటర్ల జాబితా నుంచి తొలగించాలని, జాబితాలో పేర్లు తదితర విషయాలపై చేర్పులు, మార్పులు కూడా చేపట్టాలని ఆదేశించారు.



పోలవరం: బీఎల్ఓలతో సమావేశం నిర్వహించిన తహసీల్దార్ బి.సుమతి



కొయ్యలగూడెం: ఓటర్ల జాబితాపై సమీక్షిస్తున్న అధికారులు

ఓటర్ల జాబితాపై సమీక్ష

కొయ్యలగూడెం: ఓటర్ల జాబితాల రివిజన్‌కి సంబంధించి బూత్‌లెవెల్ అధికారులకు, సూపర్‌వైజర్లకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితా ప్రచురణ, ఓటర్ల జాబితాల రివిజన్ విషయమై తహసీల్దార్ పాసం నాగమణి అధికారులకు సిబ్బందికి సూచనలు చేశారు. నూతన ఓటర్ల చేర్పులు, ఓటర్ల జాబితాలో పేర్ల సవరణ తదితర అంశాల గురించి, విధివిధానాల గురించి వివరించారు.

మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం

కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్

ఏలూరు(మెట్రో): స్టార్టప్ ఇండియా పథకం కింద ఎస్సీ, ఎస్టీ కమ్యూనిటీ నుంచి ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు లబ్ధిదారులను గుర్తించి, వారికి ఆయా రంగాల్లో శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేశ్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం సాయంత్రం ఏర్పాటుచేసిన జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశానికి కలెక్టర్ అధ్యక్షత వహించి మాట్లాడారు. ప్రతి గ్రామపంచాయతీలో యువ కేంద్రాలు ఏర్పాటు చేసి వృత్తి నైపుణ్యం తదితర అంశాలపై శిక్షణ అందించేందుకు జిల్లాలో ఇప్పటివరకు 547 పంచాయతీల నుంచి 482 మంది యువతను గుర్తించామని చెప్పారు. ఈ విషయంలో ఇప్పటికే చొరవ తీసుకున్న డీపీఓను కలెక్టర్ అభినందించారు.

ఎంఎస్ఎంఈ పారిశ్రామికవేత్తలకు రూ.23.30 లక్షల రాయితీ

సింగిల్ డెస్క్ పోర్టల్ కింద వివిధ పరిశ్రమల ఏర్పాటుకు ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు 180 దరఖాస్తులురాగా, వీటిలో 172 ఆమోదం పొందాయని, మరో అయిదు నిర్దిష్ట కాల పరిమితి పరిశీలనలో ఉన్నాయని చెప్పారు. వైఎస్సార్ జగనన్న బడుగు వికాసం కింద పెట్టుబడి రాయితీ, విద్యుత్ రాయితీ, సేల్స్ టాక్స్ రాయితీ కింద రూ 23.30 లక్షల రాయితీ సొమ్మును ఏడుగురు ఎంఎస్ఎంఈ పారిశ్రామికవేత్తలకు మంజూరుకు సమావేశం ఆమోదించింది. పీఎంఈజీపీకి సంబంధించి లబ్ధిదారులకు జాప్యం లేకుండా త్వరితగతిన బ్యాంకర్లు రుణాలు అందించేలా చర్యలు తీసుకోవాలని ఎల్‌డీఎంను కలెక్టర్ ఆదేశించారు. పరిశ్రమల స్థాపనపై లభించే ప్రోత్సాహకాలు, అనుమతుల మంజూరు మొదలగు విధి విధానాలపై జిల్లా పరిశ్రమల కేంద్రం ప్రచురించిన అవగాహన బ్రోచర్లలను కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ విడుదల చేశారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం జె.నాగరాజా, డిప్యూటీ డైరెక్టర్ పి.ఏసుదాసు, సిక్కి ప్రతినిధి నారాయణస్వామి, టిక్కీ ప్రతినిధి కె.రాజేంద్ర బాబు, ఏపీఐఐసీ జెడ్ కె.బాబ్జి, ఏపీడీసీఎల్ ఎస్ఈ సాల్మన్ రాజు, డీపీఓ టి.విశ్వనాథ శ్రీనివాస్, ఎల్‌డీఎం నీలాద్రి, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ కె.వెంకటేశ్వర్లు, సోషల్ వెల్ఫేర్ జేడీ జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్

శ్రీవారి పథకాలకు రూ.2.63 లక్షల విరాళం



సుబ్బలక్ష్మి కుటుంబ సభ్యులకు బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ చైర్మన్ సుధాకరరావు



శ్రీనివాస్ కుటుంబానికి విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ సూపరింటెండెంట్ శ్రీను

ద్వారకాతిరుమల: శ్రీవారి దేవస్థానంలోని పలు పథకాల అమలుకు భక్తులు శుక్రవారం రూ. 2,63,000లను విరాళంగా అందజేశారు. భీమవరానికి చెందిన భక్తురాలు ముదుండి సుబ్బలక్ష్మి తరపున ఆమె కుటుంబ సభ్యులు నిత్యాన్నదాన పథకానికి రూ.1.50 లక్షలు, తెలంగాణ రాష్ట్రంలోని మహబూబ్‌నగర్‌కు చెందిన బుక్కా శ్రీనివాస్, కుటుంబ సభ్యులు ప్రాణదాన ట్రస్ట్‌కు రూ.11 వేలు, విమానగోపుర స్వర్ణమయ పథకానికి రూ.51 వేలు, విద్యాదాన ట్రస్ట్‌కు రూ.51 వేలు, వెరసి రూ.1.13 లక్షలను ఆలయ కార్యాలయంలో జమ చేశారు. వీరికి ఆలయ చైర్మన్ ఎస్వీ సుధాకరరావు, ఆలయ సూపరింటెండెంట్ మద్దాల శ్రీను విరాళం బాండ్ పత్రాలను అందించి, అభినందించారు.

జ్వరంతో చిన్నారి మృతి



మావియా రజిఅల్లా

వేలేరుపాడు: వేలేరుపాడు మండల అల్లూరిన గర్ (ఒంటిబండ) గ్రామంలో షేక్ మావియా రజిఅల్లా (4) అనే చిన్నారి జ్వరంతో శుక్రవారం మృతి చెందింది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒంటి బండ గ్రామానికి చెందిన మావియాకు మూడు రోజులుగా వైరల్ ఫీవర్ రావడంతో తండ్రి ఖలీల్ తెలంగాణ రాష్ట్రంలోని సత్తుపల్లిలో ఓ ప్రైవేటు వైద్యశాలలో వైద్యం చేయించారు. గురువారం జ్వరం తగ్గడంతో మావియాను తిరిగి ఒంటిబండకు తీసుకొచ్చారు. అయితే శుక్రవారం ఉదయం ఫిట్స్‌లా వచ్చి మావియా సొమ్మసిల్లి పడిపోయింది. వైద్యం నిమిత్తం పట్టణ ప్రాంతానికి తరలించాలని ప్రయత్నించగా, అప్పటికే మావియా మృతి చెందింది. ఆడుతూ పాడుతూ తిరిగే ఏకైక కూతురు మృతితో ఖలీల్ కుటుంబం శోకసముద్రంలో మునిగిపోయింది.

ఈ – పంట నమోదుపై అభ్యంతరాలు తెలపండి

కొయ్యలగూడెం: ఖరీఫ్ పంటలో నమోదు చేయించుకున్న రైతులు తమ అభ్యంతరాలను తెలుపుకోవచ్చు అని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎస్.చెన్నకేశవులు పేర్కొన్నారు. శనివారం అచ్యుతాపురం సచివాలయం వద్ద రైతు సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఖరీఫ్ 2023లో పంట నమోదు చేసిన ముసాయిదా జాబితాను అన్ని ఆర్‌బీకే, సచివాలయాలలో ప్రదర్శించామన్నారు. అభ్యంతరాలుంటే ఈనెల 30లోగా తెలియజేయాలని కోరారు. 27, 28 తేదీల్లో ప్రతిసచివాలయంలో సోషల్ ఆడిట్ గ్రామ సభలు నిర్వహిస్తామన్నారు. సర్పంచ్ మద్దిపాటి నాగమణి, ఎంపీటీసీ మందపాటి కుమారి, గ్రామ స్థాయి సలహా మండలి గ్రామ సభలో పంట నమోదు రైతుల జాబితాలను చదివి వినిపించారు. వీఆర్ఓ అనుపమ కుమారి, వీఏఏ కె.శివరామకృష్ణ పాల్గొన్నారు.



అచ్యుతాపురంలో మాట్లాడుతున్న ఏఓ చెన్నకేశవులు

జిల్లా నాయకత్వం దృష్టికి కుక్కునూరు సమస్యలు

కుక్కునూరు: మండలంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం వైఎస్సార్ సీపీ కుక్కునూరు మండల నాయకులు ఏలూరులో జిల్లా నాయకత్వాన్ని కలిసి విన్నవించారు. జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని, ఉభయగోదావరి జిల్లాల సమన్వయకర్త మిథున్‌రెడ్డి, పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, ఎంపీ కోటగిరి శ్రీధర్‌ను కలిసి సమస్యలు విన్నవించారు. కుక్కునూరు – బూర్గంపాడు ఆర్అండ్‌బీ రహదారి నిర్మించాలని, ఆర్అండ్ఆర్ ప్యాకేజీలో భాగంగా ఫ్యామిలీ, స్ట్రక్చర్ ప్యాకేజీలో మిస్సైన పేర్లకు సంబంధించి అర్హులందరికీ ప్యాకేజీ అందించేలా చర్యలు చేపట్టాలని కోరినట్టు పార్టీ కుక్కునూరు మండల నాయకులు రావు వినోద్, మాదిరాజు వెంకన్నబాబు, కుచ్చర్లపాటి కృష్ణంరాజు, మొకరాల హరీష్, మల్లేల చంటినాయుడు, సూర్ల రాము, జక్కం నాగేశ్వరావు, రావి మధుసూదన్‌రావు తదితరులు పేర్కొన్నారు.



వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు నానితో కుక్కునూరు వైఎస్సార్‌సీపీ నాయకులు

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



కేఆర్‌పురంలో పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కలిగిస్తున్న సుధాకర్

బుట్టాయగూడెం: దోమలను అరికట్టేందుకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా ఇన్‌చార్జి మలేరియా అధికారి కేఎస్ఆర్ సుధాకర్ అన్నారు. బుట్టాయగూడెం మండలం కేఆర్‌పురంలో దోమల నివారణ పరిసరాల పరిశుభ్రతపై శుక్రవారం సాయంత్రం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలో ప్రస్తుతం డెంగీ జ్వరాలు నమోదవుతున్నాయని, జ్వరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సుధాకర్ సూచించారు. డెంగీ ఎడిస్ దోమకాటు వల్ల వస్తుందని అన్నారు. ఈ దోమ పగటిపూట కుడుతుందని చెప్పారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వ ఉన్న కొబ్బరి బొండాలు, డిస్పోజిబిల్ గ్లాసులు, పాత టైర్లు, తదితర వాటిలో నిల్వ ఉన్న నీటిలో ఈ దోమలు ఉంటాయని వివరించారు. జ్వరం వస్తే దగ్గరలో ఉన్న ఆస్పత్రికెళ్లి వైద్యులను సంప్రదించి అవసరమైన పరీక్షలు చేయించుకుని వ్యాధి నిర్ధారణను బట్టి వైద్యసేవలు పొందాలని ఆయన సూచించారు.

పండ్లు, బ్రెడ్ల పంపిణీ

జంగారెడ్డిగూడెం: మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్‌ను అందజేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ చేతుల మీదుగా చికిత్స పొందుతున్న 180 మంది ఇన్‌పేషెంట్లకు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు దల్లి కేదారేశ్వరి రెడ్డి, కార్యదర్శి గద్దే సత్యనారాయణ, ట్రెజరర్ ఇమ్మంది మాధవరావు, జిల్లా కన్వీనర్ త్రిపుర సుందరి, మండల చైర్మన్ ఆకుల ధర్మరాజు, మాజీ అధ్యక్షులు కొండ్రెడ్డి సోమరాజు, ఎల్ఐసీ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.